# రాబందులు

పచ్చటి పొలాలు గాలికి వయ్యారంగా ఇటూ, అటూ ఊగుతున్నాయి. పక్కనే నిర్మలంగా పారుతున్న కాల్వ ఆ పైరు గాలుల శబ్దానికి తంబుర మీటుతున్నట్టు గలగలమంటూ శబ్దం చేస్తోంది.

సాయంసంధ్యా సమయం షికారుగా వెళ్ళే వారికా దృశ్యం కనుల విందు కలిగిస్తోంది. ఆ ఆనందాన్ని విచ్ఛిన్నం చేస్తోందొక దృశ్యం. అటుగా వెడుతున్న వారి ఆనందాన్ని మింగేసినట్లుందా దృశ్యం. "అబ్బా చి ఛీ" అనుకుంటూ పోయేవారు కొందరైతే, ముక్కు మూసుకునేవారు కొందరు, ఖాండ్రించి వుమ్మేసేవారు మరికొందరు.

ఆ పచ్చటి పొలాల మధ్య నున్న దిబ్బ మీద ఏదో చచ్చిన జంతువుని పీక్కుతింటున్నాయి కొన్ని రాబందులు. ఆ జంతువు పేగులు బైటికొచ్చి కొన్ని అవయవాలు వూడి చూడ భయంకరంగా వుంది.

సాయంకాలం చల్లగాలికి డాబా ఎక్కిన శారదకి మాత్రం ఆ దృశ్యం జుగుప్సని కలిగించలేదు. తన చూపుల్ని ఎవరో కట్టిపడేసినట్టు అటే చూడసాగింది.

ఆలోచనలు ముప్పై ఏళ్ళ వెనక్కి పరిగెత్తాయి.

పదహారేళ్ళ ప్రాయంలో వచ్చీ రాని యవ్వనంతో, అందీ అందని ఊహలతో, కోటి కోర్కెలతో, బియస్సీ చదువుతున్న గోపాలానికి భార్యగా ఆ ఇంటికొచ్చింది.

బామ్మ తన పెళ్ళి చూడాలన్న కోర్కెని తీర్చాలని తండ్రి తనకా వయస్సులోనే పెళ్ళి చేసి, ఒక్కగానొక్క కూతుర్ని తన తాహతుకి మించిన సంబంధ మిచ్చానని పొంగిపోయేవాడు.

పెళ్లయిన కొద్ది నెలలకే మామ గారు గతించారు.

ఆ తరువాత నుంచే తన జీవితం పొలాల మధ్య దిబ్బగా తయారైంది. ఇన్నాళ్ళూ మామగారి హయాంలో కట్టుదిట్టంగా వున్న ఆ కుటుంబంలో అనేక మార్పులు రాసాగాయి. ఆ ఇంట ప్రతీ వారినీ అదుపులో పెట్టి, ఒకే మాట మీద నడిపించిన సింహ స్వప్నంలాంటి యజమాని లేకపోవడంతో, ప్రస్తుతం ఎవరికి వారే పెద్దలయి పోయారు. ముఖ్యంగా తన విషయంలో వారి ప్రవర్తనలో ఎంతో మార్పు రావడం గమనించింది. మామగారు గతించేవరకూ తన సంబంధం వారికిష్టం లేదని, తను వీళ్ళకి ఏ మాత్రం తగననే వుద్దేశ్యం

వారిలో వుందని గ్రహించలేక పోయింది. ఉదాత్తమైన మనస్తత్వంగల మామగారు, వీళ్ల యిష్టా యిష్టాల నడగకుండానే తన్ని కొడుక్కి చేసుకున్నాడని వారి మాటలవల్లే తెలుసుకుంది.

కాని ఇప్పుడు తెలిసి ప్రయోజనం ఏమిటి?

అత్తగారుగానీ, ఆడబిడ్డలుగానీ తమతో సమాన హక్కుని పంచుకునే ఒక వ్యక్తి కోడలుగా తమ ఇంటికి వచ్చిందని ఎప్పుడూ అనుకునే వారు కాదు. ఓ వంట లక్క వచ్చినట్టుగా భావించేవారు. రోజల్లా చేసే గొడ్డు చాకిరీకి భోజనం పెట్టడమే ఎక్కువని భావించేవారు. అంతటితో వూరుకోక పెళ్లిలో తమ దర్జాలకి తగ్గ మర్యాదలు జరగలేదని, ముద్దుముచ్చట్లేం తీరలేదని, జమిందారీ సంబంధ మొచ్చి వుండేదని,తమ అందాలముందు తీసికట్టని ఇంటికొచ్చిన ప్రతీవారి దగ్గర తన్ని, తనవారినీ కించపరిచేవారు.

పట్టణంలో డిగ్రీ చదువుతున్న భర్త తన చదువు పూర్తి చేసి వచ్చే వరకూ తనకీ చెరసాల తప్పదని ఓర్మితో అన్నీ సహించి వూరుకునేది.

ఇన్ని నెలలుగా తియ్యటి కలలతో గాలి మేడలతో, తియ్యటి ఊహలతో ఇన్ని కష్టాలనీ, బాధలనీ సహించి ఎదురు చూసిన రోజురానే వచ్చింది. పరీక్షలు రాసి భర్త ఇంటి కొచ్చాడు.

కానీ భర్తకి ఎదురెళ్లి పలకరించే స్వతంత్రం, ధైర్యం ఏదీ?

వంటింట్లో వున్న తనకి తల్లీ, పిల్లలూ ఆడుకునే కబుర్లూ నవ్వులూ, హాస్యాలూ వినపడుతూనే వున్నాయి. తన కొడుక్కి ఈ ఇంట్లో ఇంకో ఆత్మీయురాలు, భాగస్తురాలు వుందనీ, ఆమెకీ ఈ ఆనందాన్ని పంచుకునే హక్కు వుందనీ అందులో ఏ ఒక్కరికీ గుర్తు రావడం లేదా? కనీసం తన భర్తకైనా గుర్తు రావడం లేదూ? తన్ని గురించి తల్చుకోరూ? ఎందుకడగరూ?

ఏమో తనకీ వాళ్ళ వాళ్ళంటే భయమేమో! అందుకే పలకరించాలని వున్నా లోపలికి రావడం లేదేమో!! అయినా ఎందుకీ కంగారు? ఇన్ని నెలలుగా ఎడబాటుని సహించినదాన్ని ఇంకొన్ని గంటలు సహించలేనూ! రాత్రన్నా కలవకుండా వుండము కదా అని పరి పరివిధాలుగా పరిగెడుతున్న మనసుకి కళ్లెం వేసుకుని ఆపింది.

కాఫీ తాగి వూళ్లో స్నేహితుల్ని కలవడానికి వెళ్లిన భర్త రాత్రి తొమ్మిది దాటేక వచ్చేడు. అత్తగారే స్వయంగా భోజనం పెట్టి, పక్కలు వెయ్యడం ప్రారంభించింది.

"ఒరే గోపాలం! తలచెడ్డ మీఅక్కని ఎప్పుడూ మీ నాన్న ఆ పెద్ద గదిలోనే పడుకోబెట్టు కునేవారు. ఇవాళ దాన్ని బైట పడుకోమంటే నాన్నలేక పోబట్టీ నా గతిలా అయిందని బాధపడుతోందిరా! మీ చిన్నక్క, బావ రెండో గదిలో పడుకున్నారు. నీకు గాలి కూడా కావాలి గదా? వసారాలో మంచం వెయ్యనా?" అంటూనే వట్టి మంచం వాల్చింది.

తనూ, అత్తగారూ, ఆఖరాడబిడ్డ హాల్లో పడుకున్నారు.

ఎన్నో కోర్కెలతో, ఎన్నో తియ్యటి ఊహలతో ఎదురు చూసిన రేయి ఈ విధంగా గడిచింది.

వీలయినంత మటుకు తన్నీ, భర్తనీ దూరంగా వుంచడానికే ప్రయత్నించేదా కుటుంబం. మొదట్లో భర్త మనస్తత్వం కూడా అర్థమయ్యేది కాదు. తల్లీ, అక్కలకే భయపడి వాళ్ళుండగా తనతో మాట్లాడేవారు కాదు. రాను రాను అదే అలవాటయి తన ధ్యాసే వుండేది కాదు. ఎప్పుడన్నా ఏకాంతంగా గడిపే అవకాశం కలిగినా తన నుంచి దూరంగా వుండటానికే ప్రయత్నించేవాడు. ఎంతో ఆశగా ఎదురు చూసిన మధురక్షణాలని భర్త టూకీగా, భయం భయంగా గడిపి తప్పించుకోవడం బాధ కలిగించేది.

ఇన్నేళ్ళుగా ఎన్నో ఆశలు నింపుకుని ఈ నరకంలో జీవించింది ఇందుకేనా? అయినా తను ఈ ఇంట్లో ఎవరు? ఎవరికోసం వుంది? ఏం చూసి బ్రతకాలి? అని ఆలోచించుకున్న కొద్దీ బుర్ర వేడెక్కిపోయేది.

కాలం గడుస్తున్న కొద్దీ తన పరిస్థితి మరీ దిగజారసాగింది. పెళ్ళికి ముందు పై చదువులు చదివిస్తామన్న వాళ్ళు ఇప్పుడు ఇంట్లో మగదక్షత లేదని, పొలాలు చూసుకుంటూ ఊళ్ళోనే ఉద్యోగం చూసుకోవడం మంచిదని సలహాలివ్వడంతో అక్కడే గుమాస్తాగా చేరాడు. తల్లీ, అక్కల ఆదుపాజ్ఞల్లో నడవవలసి రావడంతో తగిన సుఖసంతోషాలు ఇంట్లో పొందలేక, కోరికల్ని చంపుకోలేక చెడు సావాసాలు మరిగాడు.

తిరిగి తిరిగి ఏ అర్థరాత్రికో ఇంటికి చేరే భర్తని చూసి గుండె చెరువయ్యేలా ఏడ్చేది. ఒకటి రెండు సార్లు అత్తగారితో చెప్ప జూసినా, "లేని పోనివి చెప్పి తల్లీ పిల్లల్ని విడదీసి నీతో చేర్చుకోవాలనా? అలాంటి చెడు పన్లు చేసే ఖర్మ వాడికెందుకు పడుతుంది? మగవాడు స్నేహితులతో తిరక్క రోజల్లా నీ కొంగుపట్టుకుని కూర్చుంటాడా? ఇప్పుడంటే అన్నావు ఇంకెప్పుడూ నా కొడుకుని నాకు దూరం చెయ్యాలని నేరాలు చెప్పకు" అంటూ మళ్ళీ నోరెత్తనివ్వకుండా చేసింది.

చెడు వ్యసనాలకి లోనైన భర్త వచ్చే జీతం చాలక నెమ్మదినెమ్మదిగా తన నగలన్నీ తీసుకెళ్ళి అమ్మేసి అటువంటివే గిల్టు నగలు తెచ్చి మెళ్ళో వేసి ఎవరికైనా చెప్తే చంపేస్తాననేవాడు.

ఓ రోజు ఇనపెట్టె తెరిచిన అత్తగారు 'లబో దిబో' మని మొత్తుకోవడం చూసింది. అందులో నగలూ, వెండి సామాను ఎవరో ఎత్తుకు పోయారని గోల పెట్టడం ప్రారంభించింది. 'ఇది భర్త పనే' అని తెలిసినా తనకి తెలీనట్లే వూరుకుంది. కాని ఎన్నాళ్ళు దాగుతుంది?

అప్పుల వాళ్ళు నెమ్మ నెమ్మదిగా ఇంటి మీదకొచ్చి గొడవలు చెయ్యడం ప్రారంభించారు. కొడుకు దురలవాట్లు నెమ్మ నెమ్మదిగా అవగాహన అయ్యాయి.

"నీ నగలు తీసుకెళ్ళిన రోజే నాకు చెప్పి వుంటే మా అబ్బాయిని బాగుచేసుకుందును. మా నగలన్నీ ఇలా మంటగలవకపోను, ఆస్తంతా అమ్మి అప్పులు తీర్చనవసరం లేకపోను. అయినా వాడి తప్పేముంది? వాడిలా తప్పుదోవ పట్టడానికి నువ్వే కారకురాలివి. ఆడదాన్ని బట్టే మగవాడికి మంచి, చెడు అలవాట్లు అవుతాయి. చెడు తోవ పట్టిన మొగుడిని పెళ్ళాం బాగు చేసుకోవాలి! ఆ తెలివి ఏడిస్తేగా! నీ లాంటి పెళ్ళాం వస్తే ఎంత మంచి మగవాడూ చెడిపోతాడు. సంసారం చక్కదిద్దుకునే తెలివి, భర్తని సన్మార్గంలో నడిపించే తెలివిలేని నీలాంటి పెళ్ళాలుంటే సంసారాలు ఇలాగే గుల్లవుతాయి" అంటూ కొడుకు చేసిన తప్పిదాలకి కూడా తన్నే బాధ్యురాలిగా చేసి రాసిరంపాన పెట్టడం ప్రారంభించింది.

మాటల మంటల్లో కాల్చే అత్తగారికేం జవాబివ్వాలి? ఆనాడు కొడుకు గురించి చెప్పబోతే ఆ తంతు, చెప్పకపోతే ఈ తంతు. అయినా ఒక్క రోజన్నా భర్తతో స్వతంత్రంగా మాట్లాడే అవకాశం తనకి వుందా? భార్యాభర్తల మధ్య వుండే అనురాగాన్ని తెంపడానికి ప్రయత్నిస్తున్నారేగాని, ఒక్క రోజన్నా నా గురించి ఒక్క మంచి మాట చెప్తున్నారా? మిగతా భార్యాభర్తల్లా ఒక్కనాడన్నా తమని ఆనందించనిస్తున్నారా? వివాహ జీవితం గురించి ఎన్ని కలలు కంది! ఎదురింటి కమలనీ, భర్తనీ చూసినప్పుడల్లా తన జీవితం కూడా అలా వుండాలని కోరుకునేది. ఆ దంపతులు ఒకరినొకరు చూసుకుంటూ మురిసిపోతూ నడుస్తూవుంటే చూసే తనలో తియ్యటి కోరికలు మనసుని కలవర పరిచేవి, ఒక్క రోజన్నా భర్తతో కలిసి ఒక్క సినిమాకి గాని, షికారుకి గాని వెళ్ళెరగదు. కనీసం ఇంట్లోనన్నా ధైర్యంగా భర్తతో మాట్లాడే స్వతంత్రం ఇవ్వని తమ భర్తనెలా చక్కదిద్దగలదు? ఈనాడు భర్త దురలవాట్లకి కారకురాలిగా తన్ని నిందించి దోషిగా నిలబెడుతున్నారే!!

భగవాన్ నేనేం పాపం చేశాననీ ఈ శిక్ష విధించావు? నువ్వయినా చెప్పు నా భర్తిలా తయారవడానికి కారణం ఎవరు? వాళ్ళా?? నేనా??

ఏళ్ళు గడిచిపోయాయి. రాసి రంపాన పెట్టిన అత్తగారు గతించింది. ఆడబిడ్డలు వారి వారిళ్ళకు వెరెళ్ళిపోయారు. భర్త పోయినామె ఉద్యోగంలో చేరి వేరే వూళ్ళో వుంటోంది.

కడుపు నిండిన ప్రతీ రాబందూ ఆ శవంతో, తనకేం నిమిత్తం లేనట్లు ఎగిరిపోయినట్లే వీళ్ళంతా కూడా ఇక తనతో ఏం సంబంధం లేనట్లే ఎవరిదారి వాళ్ళు చూసుకున్నారు.

చివరికి తనకి దక్కింది ఆఫీసులో డబ్బు తినేశాడన్న కారణంగా ఉద్యోగం తీసేసిన భర్త. తాకట్టుకున్న ఇల్లు, రెండెకరాల పొలం, చివరవి రెండూ కూడా ఏనాడో అప్పులవాళ్ళ పాలు కావలసిందే! పెద్ద సంబంధం అని ఇచ్చిన తన గతి ఈనాడు పుట్టింటి నుంచి తనకొచ్చిన వాటాతో గడిపితే గానీ గడవడం లేదు. దానికి తోడు 'ముసలి కాలానికి ముచ్చట్లు' అన్నట్లు పెళ్ళయిన ఇన్నేళ్ళకు ఇద్దరు పిల్లలు.

భగవాన్! ఎందుకీ పాపిష్టి బ్రతుకు? దరిద్రం ఒడిని కట్టుకుని, ఏ సుఖం లేకుండా ఎన్నాళ్ళీ జీవితం సాగించాలి?! ఏ తల్లి, ఇటు "అమ్మా" అని నోరారా పిల్చే పిల్లల్ని అనాథల్ని చెయ్యలేక బండగా బ్రతుకు సాగించక తప్పటం లేదు.

"శారదా! ఎప్పటికన్నా నీకు మంచి రోజులు రాకపోతాయా? వాడిని మేము తిట్టని రోజు లేదమ్మా! తిడుతున్నామని మా ఇళ్ళకి రావడం మానేశాడమ్మా!" అంటూ ఈనాడు కళ్ళ నీళ్ళెట్టుకుంటున్న ఆడబిడ్డల ఆప్యాయతకి ఆనందించాలా? బాధపడాలా?? మొదట్లోనే ఈ ఆదరణ, ఆప్యాయత ఆ కుటుంబంలో ఏ ఒకరిలో వుండివున్నా తనూ ఓ మనిషిలా జీవించి వుండేది. ఈ నీతులే మొదట్లో తన భర్తకి నేర్పివుంటే ఈనాడీ స్థితికి దిగజారి వుండేవారా? 'ఎక్కడ భార్యకి హత్తుకుపోతాడో' అన్న భయంతో తమని దూరంగా వుంచడానికి చేసిన ప్రయత్నాలు సఫలమయ్యాయని ఆనాడు ఆనందించిన వీరంతా ఈనాడు నా గురించి విచారిస్తుంటే విచారించాలా? ఆనందించాలా? తన కష్టాలని, బాధల్ని అర్థం చేసుకుని ఈనాడు తనయందు సానుభూతి కనపరుస్తూ బాధపడుతున్న ఆడబిడ్డలలో కలిగిన మార్పులా తన భర్తలోనూ మార్పు వస్తుందా? ఆనాడు చెడ్డ మాటలతో చెడు త్రోవ పట్టించిన ఈ మనుషులే, మళ్ళీ మంచి మాటలతో ఈ రోజు మంచివాడిగా మార్చగలరా? ఒకసారి తప్పుతోవ పట్టిన వ్యక్తులు తిరిగి మంచి తోవకి రారా? ఎన్నాళ్ళిలా ఆరోజుకోసం ఎదురుచూస్తు బ్రతకడం?? ఈ ఓర్మి, సహనానికి అంటు వుందా? అబ్బబ్బా! నా జీవితమంతా ఎడతెగని ప్రశ్నలే!!

'అమ్మా! అన్నం పెట్టవా? ఆకలేస్తోంది!' అన్న పిల్లలిద్దరి పిలుపూ శారదనీ లోకంలోకి తీసుకొచ్చింది. మోడుబారిన మాను చిగురుకై ఎదురుచూసినట్లు, తన జీవితానికి ఆశాసౌధాల్లా మిగిలిన పిల్లలివైపు ఆశగా, ఆప్యాయతగా చూసి, రెండు చేతుల్తో ఇద్దర్నీ పొదివిపట్టి వంటింటి వైపు నడిచింది శారద.

– వనితాజ్యోతి, ఆగస్టు 1988